Mana Telangana Dt 28/03/23

# ఎయిర్‌పోర్టు మెట్రో కోసం భూసామర్థ్య పరీక్షలు ప్రారంభం

- అలైన్‌మెంట్ స్థిరీకరణ, పెగ్ మార్కింగ్ పనులు ఇప్పటికే పూర్తి
- మెట్రో ఎండి ఎన్‌విఎస్ రెడ్డి



మన తెలంగాణ/హైదరాబాద్ : ఎయిర్‌పోర్టు మెట్రో కోసం భూసామర్థ్య పరీక్షలు (సాయిల్ టెస్టింగ్)ను సోమవారం ప్రారంభించినట్లు హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో లిమిటెడ్ (హెచ్‌ఎఎంఎల్) మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఎయిర్‌పోర్టు మెట్రో ప్రాజెక్టు కోసం అలైన్‌మెంట్ స్థిరీకరణ, పెగ్ మార్కింగ్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయని ఆయన అన్నారు. ఐకియా జంక్షన్ నుంచి ప్రారంభమై శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు చేపట్టబోయే 100 మెట్రో పిల్లర్లు నమూనాగా తీసుకొని భూసామర్థ్య పరీక్షలు చేపట్టినట్లు, ఈ పనులు పూర్తికావడానికి సుమారు రెండు నెలల సమయం పట్టవచ్చన్నారు. మెట్రో స్తంభాల నిర్మాణం ప్రతిపాదించిన ప్రతిచోట భూమి ఉపరితలం నుంచి సుమారు 40 అడుగుల లోతు వరకు త్రవ్వకం జరుపుతున్నామన్నారు. 'ఇన్‌సిటు' (అక్కడికక్కడ పరీక్షలు, ప్రయోగశాల మట్టి నమూనా పరీక్షలు, ఇలా రెండింటి ద్వారా భూ సామర్థ్యాన్ని నిర్ణయించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ పరీక్షలు నిర్వహించడం వల్ల స్తంభాల పునాదులు ఏ మేరకు తవ్వాలి, ఓపెన్ ఫౌండేషన్ లేదా పైల్ ఫౌండేషన్ నిర్ణయం, అనుమతించదగిన బేరింగ్ ప్రెజర్, తదితర విషయాలు తెలుస్తాయన్నారు. దీంతోపాటు టెండర్ ప్రక్రియలో పాల్గొనే బిడ్డర్లకు కూడా ఈ ప్రాజెక్టు నిర్మాణం జరిగే భూమి తీరుపై ఒక అవగాహన కలుగుతుందన్నారు. అలాగే వారు టెండర్లలో పాల్గొనే సమయంలో తగిన ఆర్థిక అంచనాలు రూపొందించుకోవడంలో కూడా ఈ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. భూసామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్న ప్రదేశంలో ట్రాఫిక్ నియంత్రణ, దృఢమైన బారికేడింగ్, తదితర అన్ని జాగ్రత్తలు తీసుకున్నా మన్నారు. అలాగే, జిహెచ్‌ఎంసి, వాటర్ బోర్డు, ట్రాఫిక్ పోలీస్ తదితర ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఎయిర్ పోర్ట్ మెట్రో ముందస్తు పనులు చురుకుగా పడుతున్నట్లు ఎన్వీఎస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ పరీక్షల్లో చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద్ మోహన్, సూపరింటెండెంట్ ఇంజనీర్ సాయిప రెడ్డి హెచ్‌ఎఎంఎల్.ఇంజనీరింగ్ బృందం ఆధ్వర్యంలో భూసామర్థ్య పరీక్షల నిర్వహణను జరుపుతున్నామని ఆయన తెలిపారు.